క్లుప్తంగా

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న యార్లగడ్డ వీర్రాజు

బోట్‌క్లబ్: ఆర్థికంగా వెనుకబడిన విద్యలో ప్రతిభ చూపుతున్న 15 మంది విద్యార్థులకు పారిశ్రామికవేత్త, దేవి ఫిషరీస్ అధినేత యార్లగడ్డ వీర్రాజు శుక్రవారం ప్రోత్సాహకాలు అందజేశారు. టౌన్ హాల్ కమిటీ ఆధ్వర్యంలో రూ.2 లక్షల చెక్కులును శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. టౌన్‌హాల్ కమిటీ అధ్యక్షుడు నానాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి పాబోలు చినపున్నయ్య, సభ్యులు పాలడుగు సుబ్రహ్మణ్యం, సీఆర్ జోగారావు, నేమాని రామం, జీకే శ్రీనివాస్ పాల్గొన్నారు.

సావిత్రీబాయి, జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ



సావిత్రీబాయి, జ్యోతిరావు పూలే విగ్రహాలను ఆవిష్కరించిన వీసీ ప్రసాదరాజు దంపతులు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలోని ఐఎస్‌టీ బిల్డింగ్ అవరణలో నిర్మించిన సావిత్రీబాయి పూలే, జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహాలను వీసీ డాక్టర్ జీవీఆర్‌ప్రసాద్‌రాజు శుక్రవారం ఆవిష్కరించారు. విద్యార్థినులు సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని వీసీ పిలుపునిచ్చారు. వీసీ సతీమణి అరుణ, మిహిర ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ స్వరూపరాణి, రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత, వర్సిటీ డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే వర్సిటీ ఆవరణలో రూ.4.2 కోట్లతో నిర్మించిన గౌతమి మెస్ బ్లాక్‌ను వీసీ ప్రసాదరాజు శుక్రవారం ప్రారంభించారు.

రేపు హాకీ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగంలో బాలురు, బాలికల హాకీ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు హాకీ సంఘ కార్యదర్శి నంబు శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. స్థానిక డీఎస్‌ఏ క్రీడా మైదానంలోని హాకీ కోర్టులో ఉదయం 8 గంటలకు ఎంపికలు ప్రారంభమౌతాయన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, ఎస్సై మణికుమార్ సిబ్బంది

కాకినాడ రూరల్: మండలం తూరంగి పగడాలపేట వద్ద యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఇంద్రపాలెం పోలీసులు పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం రాత్రి ట్రైనీ డీఎస్పీ కె.ప్రమోద్, ఎస్సై బి.మణికుమార్, సిబ్బంది పగడాలపేట దగ్గరలో వై.జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో మల్లాడి రాంబాబు అనే వ్యక్తి యానాం నుంచి మద్యం సీసాలు తీసుకువస్తుండగా పట్టుకున్నారు. ఆరు బీర్‌బాటిల్స్, ఒక వైట్‌హాల్, మద్యం ఫుల్‌బాటిల్స్ స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే ప్రాంతంలో మరో వాహనాన్ని తనిఖీ చేయగా సర్పాపురం మండలానికి చెందిన తంగెళ్ల నగేష్ నుంచి ఆరు మద్యం ఫుల్‌బాటిళ్లను, రెండు బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలు నాటిన అధికారులు

కాకినాడ సిటీ: గణతంత్ర దినోత్సవ సందర్భంగా కాకినాడ ట్రెజరీ కాలనీ పార్కులో మాజీ కార్పొరేటర్ జెడీ పవన్‌కుమార్, డిప్యూటీ డీఈవో సుభద్ర శుక్రవారం 100 మొక్కలను నాటారు. ఈ మొక్కలను రాంజీ, అబ్బు అనే వ్యక్తులు బహూకరించారు చేశారు.

ఆనూరులో భగవద్గీత శ్లోకాల పోటీలు

పెద్దాపురం: ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం మండలం ఆనూరులో భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. దర్భా వెంకటేశ్వర శర్మ న్యాయ నిర్ణేతగా వ్యవహరించగా సీనియర్లు, జూనియర్ల విభాగాల్లో విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం మల్లికార్జున స్వామి గీతా ప్రవచనం చేశారు. నిర్వాహకుడు సత్యకుమార్, కృష్ణ మనోహర్, వేద గీతామత, అంబిక, శ్రీదేవి, హర్షిత ఆలయ కమిటీ సభ్యులు వీఎస్ చక్రవర్తి, ఎన్ఎస్‌వి మూర్తి, ఎన్ఎస్‌వీ అప్పాజీ, యు.సుధీంద్ర, ఆలయ అర్చకులు ఆఖండం సతీష్‌శర్మ, కె.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కొడా కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న చైర్మన్ చంద్రకళాదీప్తి, కమిషనర్ నాగ నరసింహారావు



వాకలపూడి ఉమా మనో వికాస కేంద్రంలో ఏడీ నారాయణరావు, ఎస్పీ రెడ్డి తదితరులు



నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో విద్యార్థినుల నృత్య రూపకం



లహరిదుర్గను సత్కరిస్తున్న దేవదాయ శాఖ డీసీ మేడేపల్లి విజయరాజు



కోర్టు ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్జి కమలాదేవి, న్యాయమూర్తులు

ఉప్పొంగిన జాతీయత

- నింగిలో గర్వంగా త్రివర్ణ పతాక రెపరెపలు
- ఘనంగా గణతంత్ర దినోత్సవం
- పతాకావిష్కరణలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కాకినాడ రూరల్: భారత గణతంత్ర వేడుకలు అంబరాన్నంటాయి. నియోజవర్గంలో శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ సంస్థలు, ప్రైవేట్ కార్యాలయాల వద్ద జాతీయ జెండా రెపరెపలాడింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు. ఆయన అందించిన రాజ్యాంగ ఫలాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఇన్‌చార్జి వీసీ, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ నాగనరసింహారావు, సిబ్బంది పాల్గొని జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌పీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ కర్రే స్వప్న, ఏఓ చంద్రశేఖర్, ఏఈ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మురార్జీ, డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్, ఏపీ పొల్యూషన్ కార్యాలయంలో ఈఈ సందీప్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రంలో జీఎం మురళీధర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టరు ఆఫ్ ఫ్యాక్టరీ కార్యాలయంలో రాధాకృష్ణ, నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో ప్రిన్సిపాల్ ప్రశాంత శ్రీ, ఉమా మనో వికాస కేంద్రంలో దివ్యాంగుల సంక్షేమ, ట్రాన్స్‌జెండర్స్ మరియు సీనియర్ సిటిజన్స్ సహాయ సంచాలకులు(ఎఫ్ఏసీ) పాటంశెట్టి నారాయణమూర్తి, ఎస్పీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సర్పవరం జంక్షన్‌లో వాకర్స్ సంఘం, లయన్స్ విజన్ కాకినాడ క్లబ్, అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు జరిగాయి.

కరపలో..

కరప: మండలంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.అప్పారావు, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఏడీఏ కార్యాలయం ఏడీఏ కె.బాబూరావు ఆధ్వర్యంలో జాతీయ పతాకాలను ఎగురవేశారు. అలాగే వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద చైర్మన్ కె.సీతారామాంజనేయులు, పోలీసు స్టేషన్ వద్ద ఎస్సై కె.రామకృష్ణ, పీహెచ్‌సీల వద్ద డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్, డాక్టర్ ఎంకే సౌజన్య, కరప హైస్కూల్‌లో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, గ్రామ పంచాయతీల వద్ద కార్యదర్శులుతో కలిసి సర్పంచ్‌లు, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు మువ్వన్నెల జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో-2 పి.సత్యనారాయణ, నడకుదురులో మండల బీజేపీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మండల ఎస్సీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వివిధ గ్రామాల్లో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, పెంకే సత్తిబాబు, మద్దూరి భవాని తదితరులు పాల్గొన్నారు. గురజనాపల్లి హైస్కూల్‌లో మాజీ సైనికులు పబ్బినీడి కనకరాజు, చింతపల్లి అర్జునుడులను సర్పంచ్ ఎ.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు పబ్బినీడి పాపారావు, హెచ్ఎం ఎ.సాయిమోహన్ ఘనంగా సత్కరించారు.



గణతంత్ర వేడుకల్లో కార్పొరేషన్ కమిషనర్ నాగనరసింహారావు, ఇతర అధికారులు



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 ప్రసాదరెడ్డి



జి.భావారంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

రాజ్యాంగం అమలులోకి వచ్చినరోజు

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1950 జనవరి 26వ తేదీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలులోకి వచ్చిందని, అప్పటి నుంచి గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని జి.భావారంలో శుక్రవారం సర్పంచ్ రొక్కాల గణేష్ ఆధ్వర్యంలో రూ.2.5 లక్షలతో నిర్మించిన భారత రత్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కన్నబాబు ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ముందుగా యండమూరు, వడ్డిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి రూ.1.1 కోట్లుతో నిర్మించిన ఇంటింటికీ కుళాయి కనెక్షన్, అరుంధతిపేటలో నిర్మించిన బాబూ జగ్జీవన్‌రామ్ భవనం, అంబేడ్కర్ విశ్రాంతి భవనం తదితర పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మార్నెళ్ల శివ, రొక్కాల గణేష్, మాజీ సర్పంచ్ మార్నెళ్ల వెంకటరమణ, రాయుడు శ్రీనివాస్, పెంకే సత్తిబాబు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు



ఆర్డీవో కార్యాలయంలో పతాకావిష్కరణ చేస్తున్న ఆర్డీవో కిశోర్ తదితరులు

కాకినాడ సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి జాతీయ జెండా ఎగురవేసి గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. అలాగే, ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఇట్ల కిశోర్, డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ శ్రీరమణి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో పీడీ కొండా ప్రవీణ తదితరులు జాతీయ పతాకాలు ఎగురవేశారు.

డీసీసీబీలో..

బాలాజీచెరువు: ఉమ్మడి తూర్పుగోదావరి డీసీసీబీలో సీఈఓ ఆర్‌వీ నరసింహారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డైరెక్టర్లు పంతం గంగా భవానీరామ్, సయ్యద్ మెహిద్దీన్, జీఎం ప్రవీణ్‌కుమార్, ప్రకాష్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకేలో..

జేఎన్‌టీయూకేలో నిర్వహించి గణతంత్ర వేడుకలకు వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు ముఖ్య అతిథిగా హాజరై ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. డాక్టర్ అబ్దుల్‌కలాం కలలు కన్న విజన్ 2020 సాకారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీఎం జగన్ అందిస్తున్న పథకాల ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సైనిక కుటుంబ సభ్యులను సత్కరించారు. రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత, స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో..

కాకినాడ లీగల్: కాకినాడ కోర్టు ఆవరణలో మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు, న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే బార్ అసోసియేషన్ భవనం వద్ద అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 టి.ప్రసాదరెడ్డి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో..

కాకినాడ: గణతంత్ర దినోత్సవాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, ఇతర అధికారులు జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని కమిషనర్ ఆవిష్కరించారు. దేశ సమైక్యత, సమగ్రత, పరిరక్షణకు, అభివృద్ధికి పునరంకితమవుతామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వివిధ విభాగాల్లోని 45 మంది సిబ్బంది, సచివాలయ ఉద్యోగులకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎస్ఈ పి.సత్య కుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఈఈ మాధవి, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, వివిధ విభాగాధిపతులు, సూపరింటెండెంట్లు, కార్పొరేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో...

స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన నాయకులు కార్యకర్తలు పతాకావిష్కరణ చేశారు. కార్యకర్తలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో కొడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పైండా సత్తిరాజు మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో..

బోట్‌క్లబ్: స్థానిక సాలిపేటలోని పైండా సత్తిరాజు మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు జాతీయ జెండా ఆవిష్కరించారు. విద్యార్థులకు వక్తృత్వ, కరాటే పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. నేషనల్ గేమ్స్‌కు ఎన్నికైన జి.లహరిదుర్గకు ఆయన రూ.25 వేలు, విడోస్‌హోమ్ చైర్మన్ పైండా రామకృష్ణారావు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేసి అనంతరం సత్కరించారు. జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి, డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, పాఠశాల హెచ్ఎం సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.



సైనిక కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న శివప్రసన్న, చంద్రకళాదీప్తి తదితరులు



మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ పంతం గంగా భవానీరామ్



ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో రమణారెడ్డి



కరప మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పారావు



కరప హైస్కూల్‌లో జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న జెడ్పీటీసీ సుబ్బారావు



కరప తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో..



గురజనాపల్లి హైస్కూల్‌లో మాజీ సైనికులను సత్కరిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు



కలెక్టర్ కృతికా శుక్లా నుంచి అవార్డు అందుకుంటున్న స్మార్ట్‌సిటీ ఎండీ, సీఈవో సీహెచ్ నాగనరసింహారావు, కరప ఎంఈవో-1 కృష్ణవేణి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఏఎంవీఐ కళాజ్యోతి, కాకినాడ రూరల్ ఎంపీడీఓ స్వప్న, నగరపాలక సంస్థ ఏఈ నాగేశ్వరరావు. కార్పొరేషన్‌లోని పారిశుధ్య కార్మికురాలికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

అధికారులకు పురస్కారాలు

ఉత్తమ సేవలకు పురస్కారం

కాకినాడ/కరప/కాకినాడ రూరల్/: జిల్లాలో వివిధ కార్యాలయాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన ఉద్యోగులను ఉత్తమ పురస్కారాలు వరించాయి. వారికి కాకినాడ జిల్లా పోలీసు పెరేడ్‌గ్రౌండ్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఎస్.ఇలక్కియ, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు శుక్రవారం పురస్కారాలు అందించారు. ఆయా ఉత్తమ సేవకులను ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది అభినందించారు. కాకినాడ రూరల్ మండల ఎంపీడీఓ కర్రే స్వప్న, ఏపీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్ టి.రవి, ఎస్‌డీఆర్ఎఫ్ ఆర్ఎస్సై బి.రాధాకృష్ణ, కాకినాడ యాంకరేజ్ పోర్టు ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీధర్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు, సర్పవరం సబ్ రిజిస్ట్రార్ సీహెచ్ రమేష్, తదితరులు పురస్కారాలు అందుకున్నారు. అలాగే కరప ఎంఈవో-1 కె.బుల్లికృష్ణవేణి, మండల ఈవోపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, నడకదురు వెల్‌నెస్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ కె.స్వాతి అహల్య, కాకినాడ రవాణాశాఖ కార్యాలయ ఏఎంవీఐ ఎం.కళాజ్యోతి పురస్కారాలు అందుకున్నారు.

స్మార్ట్‌సిటీ శకటానికి తృతీయస్థానం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాకినాడ స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనులపై ఏర్పాటు చేసిన శకటానికి తృతీయస్థానం లభించింది. ఈ మేరకు స్మార్ట్‌సిటీ ఎండీ, మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావుకు కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా ప్రశంసాపత్రాన్ని, అవార్డును అందజేశారు. స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకట్రావు ఇతర అధికారులు కార్యక్రమంలో ఉన్నారు.

ఉత్సాహంగా వాకథాన్

కాకినాడ సిటీ: జాతీయ రహదారి భద్రతా మహోత్సవాల్లో భాగంగా కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్‌లో శుక్రవారం వాకథాన్ నిర్వహించారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, ఆర్అండ్‌బి సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.శ్రీనివాసరావు, డీసీసీ ఎ.మోహన్, ఆర్టీఓ సాయిప్రసాద్, ఎంవీఐ బీవీ మురళీకృష్ణ, వి.హరినాథ్‌రెడ్డి, బి.కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించకుండా, మద్యం తాగి, సెల్ ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా బండి నడిపి ప్రమాదాల పాలై గాయపడిన సందర్భాల్లో క్షతగాత్రుడిని సరైన సమయంలో సమీప ఆసుపత్రికి తరలించిన వ్యక్తిని గుడ్ సమరిటన్ అంటారని తెలిపారు. గుడ్ సమరిటన్‌కు నెలకు జిల్లాలో ముగ్గురిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున పారితోషికం ఇస్తారన్నారు. రాష్ట్రంలో గుడ్‌సమరిటన్‌గా ఎంపికైన వారికి రూ.10 వేలు పారితోషికం ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, పోలీస్, ఆర్టీసీ, ఇంజినీరింగ్, మున్సిపాలిటీ, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటో డ్రైవర్లు, డ్రైవింగ్ స్కూల్ సిబ్బంది, పొల్యూషన్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



గాత్ర కచేరీ చేస్తున్న మాళవిక సుమధర్

ఆకట్టుకున్న గాత్ర కచేరీ

బోట్‌క్లబ్: స్థానిక సంగీత విద్వసభ-సంగీత నృత్యోత్సవాల్లో భాగంగా స్థానిక సూర్యకళామందిరంలో శుక్రవారం రాత్రి చెన్నైకి చెందిన మాళవిక సుమధర్ గాత్ర కచేరీ అందరినీ ఆకట్టుకుంది. కళ్యాణి వర్ణంతో ప్రారంభించి, నాట రాగంలో త్యాగరాజ పంచరత్న కీర్తన జగదానంద కారక, ఖమాస్ రాగంలో బ్రోచేవారెవరురా మొదలైన కీర్తనలు గానం చేసారు. ఆమె గాత్ర కచ్చేరిపై వయోలిన్‌పై మావుడూరి సత్యనారాయణశర్మ, మృదంగంపై మంగళగిరి శ్రీధర్, ఘటంపై మావుడూరి సూర్యప్రసాదరావు సహకారం అందించారు. పోతుల సూర్యకుమారి ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

భోజనం ప్లేట్ల అందజేత

కాకినాడ సిటీ: తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును అభినందిస్తూ ఆ గ్రామానికి చెందిన టి.పల్లంరాజు రూ. 15వేలు విలువ చేసే 100 భోజనం ప్లేట్లను పాఠశాలకు శుక్రవారం అందజేశారు. పాఠశాల హెచ్ఎం కడలి విజయదుర్గ, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలపై ఆదేశాలివ్వాలి

కాకినాడ సిటీ: ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలపై ఆదేశాలు విడుదల చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరారు. శుక్రవారం కాకినాడ కచేరిపేటలోని సీఐటీయూ జిల్లా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ, ప్రధానకార్యదర్శి ఏరుబండి చంద్రావతిలు మాట్లాడారు.